(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

శిల్పం

'శిల్పం' అనే పదానికి సాహితీపరంగా ఎవరూ సరియైన నిర్వచనం నాకు తెలిసినంతలో ఇవ్వలేదు. ఒక కొబ్బరికాయలోకి నీళ్ళు ఎలా వస్తాయో తెలియనట్టే, రచనలో శిల్పం అంతర్లీనంగా మిళితమై ఉంటుంది.

సంఘటనలూ, శైలీ, పేరాగ్రాఫ్‌లు విడగొట్టడం, పాత్రపోషణ, నాటకీయత - ఇవన్నీ శిల్పంలో భాగాలే అని నా ఉద్దేశ్యం. రచన ఎంత బావున్నా, కథ ఎంత బావున్నా, పాత్రలు ఎంత గొప్పగా ఉన్నా నాటకీయత పండినా కూడా శిల్పం లేకపోతే ఆ రచన రక్తి కట్టదు.

ఒక సమర్థుడైన డాక్టరు ఆపరేషన్ చేస్తున్నప్పుడు ఎంత చక చకా శరీరాన్ని కోసి తిరిగి కుట్టేస్తాడో, నేర్పరియైన శిల్పి, ఒక రాతిని చూసి అంచనా వేసి అందంగా చెక్కటం ప్రారంభిస్తాడో - అదే విధంగా అనుభవజ్ఞుడైన రచయిత శిల్పం గురించి ఎక్కువ ఆలోచించకుండానే అతడి రచనలో అది చోటు చేసుకుంటుంది. అయితే క్రొత్త రచయితలు మాత్రం నిరంతర కృషి ద్వారా దీన్ని సాధించవచ్చు. కానీ ఇక్కడ ఒక్క విషయం. శైలీ, పాత్రపోషణ, కథ - మొదలైనవన్నీ రచయిత యొక్క కృషి మీద ఆధారపడితే, శిల్పం మాత్రం దేవుడిచ్చిన వరమే. దాన్ని ఎంతవరకు నగిషీ చెక్కాలనేది రచయిత యొక్క కృషి మీద ఆధారపడి ఉంటుంది.

ఒక నవలలో ఏ సీను ఎంతవరకూ లాగాలి అన్న విషయం గురించి ఇంతకుముందే ఒకసారి చర్చించటం జరిగింది. శిల్పంలో ఈ విషయం ఎక్కువ ప్రాముఖ్యత వహిస్తుందని నేను అనుకుంటున్నాను.

పాఠకుడికి ఏ మాత్రం ఉత్సాహంలేని సీనులు, బాగా విషాదం ఉండి ఆ విషాదంలో ఏ మాత్రం ఆర్ద్రతా లేని సీనులు - పాఠకుడికి తెలియని అంశం మీద పేజీలకు పేజీలు, కథకి అవసరం లేని పాత్రల గురించి వివరణలు, శైలిలో ఏ మాత్రం పటుత్వం లేని వర్ణనలు ఇవన్నీ శిల్పాన్ని దెబ్బతీస్తాయి.

అవసరం లేని సీనులు తొందరగా ముగించి పాఠకులకి ఉత్సాహంగా ఉండే సీనులు విపులీకరించి వ్రాయటం మాత్రమే ద్వారా పాపులర్ రచనల్లో పాఠకులని ఆకట్టుకోవచ్చు.

ఉదాహరణకి రామాయణాన్ని ఒక నవలగా వ్రాయదలచుకుంటే కైకేయి దశరథుడిని మూడు కోరికలు కోరుతూ రాముడిని అడవికి పంపమంటుంది. రాముడు సీతతో కలిసి అడవికి వెళతాడు. అక్కడ రావణాసురుడు సీతని ఎత్తుకు వెళ్ళిపోతాడు.

ఈ పై కథని ఒక రచయిత పాపులర్ నవలగా వ్రాయదలచుకుంటే మూడు కోరికలు కోరుతూ రాముడిని అడవికి పంపమనటం, యాభై పేజీలు వ్రాసి, ఆ తరువాత దశరథుడి దుఃఖాన్ని మరో వంద పేజీలు వ్రాసి, రాముడు అడవికి వెళ్ళింతరువాత సీతని రావణాసురుడు ఎత్తు కెళ్ళడం, అతడితో యుద్ధం మిగతావన్నీ మరో పాతిక పేజీల్లో పూర్తి చేస్తే పాఠకుడికి ఇంట్రస్టేమీ ఉండదు.

ఎందుకంటే తన భార్యని సాధించాడు అనేది ఇక్కడ ఇంట్రెస్టింగ్ పాయింట్. వీలయినంత క్లుప్తంగా మొదటి భాగంలో సంఘటనలు పూర్తి చేసి, రావణాసురుడు సీతని ఎత్తుకుపోయిన దగ్గర్నుంచి ఎక్కువ పేజీలు వ్రాస్తే సస్పెన్సు బావుంటుంది.

ఇలా కాకుండా దశరథుడి దుఃఖాన్ని హృదయవిదారకంగా వర్ణించగలిగే సత్తా తనకుంది అని రచయిత భావించిన పక్షంలో, దాన్ని బాగా విపులీకరించి వ్రాయొచ్చు. తండ్రీ కొడుకుల మధ్య ఉన్న ఆత్మీయత, ఎడబాటు, ఇచ్చిన వాగ్దానం నెరవేర్చుకోవటంలో దశరథుడు పడే తపన, బాధ, నిస్సహాయత పాఠకుల్ని ఆకట్టుకోగలిగితే అదీ మంచిదే కానీ ఇలాంటివి వ్రాసేటప్పుడు రచయిత బాగా కష్టపడాలి. ఇంతకుముదే చెప్పినట్లు (ముఖ్యంగా పాపులర్ నవల్లో)ఒక సస్పెన్స్ పాయింట్ పెట్టి ఆ ముడి విప్పకుండా చివరవరకూ ఏం వ్రాసినా ఫరవాలేదు. ఏ రసాన్ని పోషించినా ఫరవాలేదు. ముడి మాత్రం ఎంత తొందరగా వేస్తే అంత మంచిది. దుఃఖాన్ని వర్ణించగలిగే సత్తా తనకుందని రచయిత భావిస్తే, రాముడి వియోగం వల్ల దశరథుడి దుఃఖాన్ని వర్ణించటం కన్నా, సీతా వియోగం పట్ల రాముడి దుఃఖాన్ని వర్ణించటం మంచిది. సస్పెన్స్ పాయింట్ సీతా వియోగంతో ప్రారంభమవుతుంది కాబట్టి.

ఛాప్టర్

ఒక వాక్యం ముగించడం ద్వారా, పేరాగ్రాఫ్ డివైడ్ చేయటం ద్వారా, అధ్యాయం ముగించడం ద్వారా రచనకి అందం తీసుకు రావచ్చు. పాఠకుల్లో ఉత్సుకత పెంపొందించవచ్చు. 'ప్రియురాలు పిలిచె'కి సంబంధించిన ఒక చిన్న సంఘటనని చదవండి.

"ఆగండి" గట్టిగా అంది శ్రీ కల్యాణి "... నేను కదలలేనని, జీవచ్ఛవంలా ప్రక్క మీదే ఉంటాననేగా మీరలా వెళ్ళిపోగలుగుతున్నారు?" కోపమూ, నిస్సహాయతా మిళితమైన స్వరంతో నిలదీసింది.

కార్తికేయ ఆమె దగ్గరగా వచ్చి తలమీద అనునయంగా చెయ్యి వేసి "ఆవేశపడకు ప్లీజ్" అన్నాడు. ఆమె విసురుగా అతని చెయ్యిని తీసివేసింది.

అతడు ఆమె ఐపు ఒక్క క్షణం చూసి బయటికి నడిచాడు.

ఆ ఇంట్లో మొట్టమొదటిసారిగా ఇనిపించిన భార్య భర్తల ఘర్షణని క్రింది నుంచి నౌకర్లు ఆశ్చర్యంగా వింటున్నారు.

కార్తికేయ వడివడిగా బయటికొచ్చి, మెట్లు దిగి, కారెక్కి రయ్యిన వెళ్ళిపోయాడు. ఆ ఇంట్లో పెద్ద వర్షం వచ్చి ఒక్కసారి వెలిసినట్టయింది. సోఫా వెనక అప్పటి వరకూ కూర్చున్న అశ్వత్థామ పిస్టల్‌తో పైకి లేచాడు.

(అధ్యాయం సమాప్తం)

ఈ విధంగా ఒక అధ్యాయాన్ని పూర్తి చేయటం ద్వారా పాఠకులో టెన్షన్‌ని పెంచటమే కాకుండా, తరువాత ఏమవుతుంది అన్న సస్పెన్స్‌ని కూడా పోషించవచ్చు.

ఒక అధ్యాయం పూర్తవ్వగానే, రెండో అధ్యాయాన్ని అదే పాత్రలతో కాకుండా వేరే పాత్రలతో మొదలు పెడితే అప్పుడు రచన బాగా రక్తి కడుతుంది. పూర్తయిన అధ్యాయంలో ఏం జరిగింది - అన్న టెన్షన్‌తో ఉన్న పాఠకులు రెండో అధ్యాయాన్ని చాలా ఆసక్తిగా చదవటం మొదలుపెడతారు. ఆ రెండో అధ్యాయం ముగింపు కూడా ఈ రకమైన సస్పెన్స్‌తో పూర్తి చేసి, ఎక్కడయితే మొదటి అధ్యాయాన్ని మనం వదిలేశామో, అక్కణ్ణుంచి మళ్ళీ ప్రారంభించి, అక్కడ సస్పెన్స్ విప్పి, మళ్ళీ మరొక ముడి వేసి, దాన్ని అక్కడ ఆపుచేసి, మూడో అధ్యాయాన్ని తిరిగి ప్రారంభించి వ్రాయటం చాలా విజయవంతంగా నవల పూర్తవటానికి దోహదపడుతుంది. ఈ రకమైన టెక్నిక్ ఇంగ్లీష్ పాపులర్ రచనల్లో బాగా గమనించవచ్చు. ముఖ్యంగా ఆర్థర్ హేలీ, ఇర్వింగ్ వాలెస్ మొదలైన రచయితల రచనల్లో ఇలాంటి ఛాప్టర్స్ ఎక్కువగా ఉంటాయి.

అధ్యాయం ముగింపు ఎంత గొప్ప ప్రభావాన్ని చూపిస్తుందో, వారపత్రికల్లో సీరియల్స్ వ్రాసేటప్పుడు, సశేషానికి ముందు వ్రాసిన వాక్యం కూడా అంత ప్రభావాన్ని చూపిస్తుంది. అందుకే పాపులర్ రచయితలందరూ సీరియల్స్ వ్రాసేటప్పుడు రెండు మూడు పేరాగ్రాఫ్‌ల

చివరి కొచ్చేసరికి ఏదో ఒక మెలిక పెట్టి ఆపు చేస్తూ ఉంటారు. ఇటు వంటి పాపులర్ రచనలకి మూలాధారం చందమామలో వచ్చే సీరియల్స్.

చందమామ సీరియల్స్ చదివేవరికి ఈ విషయం బాగా గుర్తు ఉండి ఉంటుంది. చివరికొచ్చేసరికి ఏదో ఒక ఉపద్రవం సృష్టించడం ద్వారా, వచ్చే నెల ఏమవుతుంది అని పాఠకులు ఎదురు చూడటం చిన్నప్పుడు నాకు బాగా తెలుసు. నేను రచయితనయిన తరువాత ఈ టెక్నిక్ అవలంబించడానికి కూడా ఇదే కారణమై ఉండొచ్చు.

<u>పేరాగ్రాఫ్లు</u>

కొంత మంది వర్ధమాన రచయితలు వ్రాసే రచనల్లో పేరాగ్రాఫ్స్ అసలు ఉండవు. వాక్యం తరువాత వాక్యం, సంభాషణ తరువాత సంభాషణ వ్రాసుకుంటూ పోతుంటారు.

పాఠకుడి చూపు ఒక వాక్యం మీద కొనసాగుతున్నప్పుడు, ఆ వాక్యం పూర్తయితే, మళ్ళీ అతని చూపు క్రింద లైన్ మీద ఫ్రెష్‌గా మొదలవుతుంది. చూపు క్రిందకి దిగేటప్పుడు అరక్షణం పాటు అతడు రిలాక్స్ అవుతాడు. అలా రిలాక్స్ అవటం చాలా అవసరం. అందుకే రచనలో పేరాగ్రాఫ్‌లో అవసరం కలుగుతుంది. రచయిత ఒక పాఠకుడి యొక్క మూడ్‌ని ఒకే రకంగా కొనసాగించదలచుకుంటే పేరాగ్రాఫ్‌ల అవసరం లేదు.

పాఠకుడిని రచనలో పూర్తిగా నిమగ్నం చేయాలంటే రచనలో పేరాగ్రాఫ్‌లు చాలా అవసరం.

దీనికి అన్నిటికన్నా గొప్ప ఉదాహరణ సినిమా.

హీరో, హీరోయిన్ మాట్లాడుకుంటున్నప్పుడు కెమేరా ఒక చోట నిలబెట్టి వారిద్దరి సంభాషణ పూర్తిగా చిత్రీకరించవచ్చు. కానీ దర్శకుడు అలా చేయడు. హీరోయిన మాట్లాడుతున్నప్పుడు హీరో భుజం మీంచి హీరోయిన్ని చూపిస్తాడు. అలాగే హీరో మాట్లాడుతున్నప్పుడు కెమెరాను అటు తిప్పి చూపిస్తాడు. ఇద్దరూ కదలటం మొదలు పెట్టిన తరవాత కెమేరాను దూరంగా పెట్టి వారిద్దరూ ఫ్రేంలోంచి దూరంగా నడకసాగించినట్టు చూపిస్తాడు. దీన్ని షాట్ డివిజన్ అంటారు.

రచనలో పేరగ్రాఫ్‌లు కూడా ఈ విధమైన షాట్‌డివిజనే.

పై ప్రియురాలు పిలిచె ఉదాహరణ గమనిస్తే కార్తికేయ తన భార్యతో మాట్లాడాడు. అదొక పేరాగ్రాఫ్.

శ్రీకళ్యాణి తన భర్తతో మాట్లాడింది. అది ఒక పేరాగ్రాఫ్.

కార్తికేయ బయటకి నడిచాడు.

అంతా అయిపోయిన తరువాత సోఫావెనకనుంచి విలన్ పిస్టల్‌తో పైకి లేచాడు.

దీన్ని రచయిత ఒక దృశ్యంగా ఊహించుకోవాలి. ఎవరు మాట్లాడుతూ ఉంటే వారి సంభాషణని ఒక పేరాగ్రాఫ్‌గా వ్రాయాలి. ఆ తరువాత వాళ్ళిద్దరూ కలిసి వెళ్ళినా విడివిడిగా వెళ్ళినా అది మరొక పేరాగ్రాఫ్‌గా చేయాలి. ఇదే సంభాషణలో ఒక కొత్త పాత్ర ప్రవేశిస్తుంటే, దాన్ని ఒక క్రొత్త పేరాగ్రాఫ్‌తో ప్రారంభించాలి.

అనవసరమైన చోట్ల పేరాగ్రాఫ్‌లు ఉపయోగించటం, అవసరమైన చోట్ల పేరాగ్రాఫ్‌లు ఉపయోగించలేకపోవటం పాఠకుడికి అసంకల్పింతంగానైనా సరే ఒక రకమైన అసంతృప్తిని కలిగిస్తుంది.

"హేమంతాన్ని, వసంతాన్ని కలిపి అంటుగడితే పుట్టిన అపురూపమైన మొక్కలా ఉంది ఆ పెయింటింగ్. ఆమె దాన్ని చూస్తూ మీకు ఇందులో కూడా ప్రవేశముందా అని అడిగింది. హఠాత్తుగా వెనక నుంచి వినబడిన ఆ ప్రశ్నకు అతడు అదిరిపడి, వెనక్కి చూసి, కంగారుపడ్డాడు. 'క్షమించండి మేడమ్. మీరు లేచారనుకోలేదు కాఫీ తీసుకువస్తాను. అంటూ హడావిడిగా వంటింట్లోకి పరుగెత్తాడు.

ఆమె వద్దనలేదు. అతడు కాఫీ కప్పుతో ప్రవేశిస్తూ, అన్నాడు ప్రొద్దునే మీరు తొందరగా లేవరని నేనే కాఫీ కలిపాను.' ఇట్సాల్ రైట్ అందామె కప్పు అందుకుంటూ."

ఈ పై సంఘటనలో ఎక్కడ పేరగ్రాఫ్‌లు విడదీయబడలేదు. అందువల్ల దాన్ని చదివితే ఎంత అసంతృప్తిగా ఉందో ఈ పాటికే మీకు అర్థమై ఉంటుంది. అదే సం బాషణని ఈ విధంగా చదవండి.

హేమంతాన్ని వెనకనుంచి వినపడిన ఆ ప్రశ్నకు అతడు అదిరి పడి వెనక్కి తిరిగి, ఆమెను చూసి కంగారు పడ్డాడు. "క్షమించండి మేడమ్. మీరు లేచారనుకోలేదు. కాఫీ తీసుకువస్తాను" అంటూ హడావిడిగా వంటింట్లోకి పరుగెత్తాడు. ఆమె వద్దనలేదు.

అతడు కాఫీ కప్పుతో ప్రవేశిస్తూ, "ప్రొద్దున్నే మీరు తొందరగా లేవరని నేను కాఫీ కలిపి ఉంచలేదు." అన్నాడు.

"ఇట్సాల్ రైట్!" అందామె కప్పు అందుకుంటూ.

ఈ విధంగా పేరాగ్రాఫ్‌లు, ఆశ్చర్యార్థకాలూ, కామాలు, ఫుల్‌స్టాపులు, ఇన్‌వర్టెడ్ కామాలు - రచయిత చెప్పదలచుకున్న భావాన్ని అతర్లీనంగా పాఠకుల్లో కలిగిస్తుంటాయి.

వచ్చే సంచికలో.. సస్పెన్స్